



పి. ప్రేమచంద్ర

"మేరా దిల్ ముఝె లౌటాదో...." పాకిస్తాన్ రేడియోనుండి ప్రొద్దుటే శ్రావ్యముగా తలత్ పాడేస్తున్నాడు. సరోజ రాత్రి సినిమా నుండి వచ్చి పడుకుందేమో త్వరగా మెలుకువరా లేదు. ఆ పాట నెమ్మదిగా చెవుల్లో పడి పక్క మీద అటునుండి ఇటు కదిలింది. ఆశ్చర్యంగా ఒక్కసారి లేచి, తలగడ మీద మోచేయి ఆనించి, ఆ పాట ఎక్కడ నుండి వస్తోందా అన్నట్లు కళ్లు నులుపుకుని కిటికీలో నుండి బయటకు చూచింది. ..వాళ్ల యింటి ఎదురుగా ఉన్న ఇంట్లోనుండే! అరె! ఈ ఇల్లు నిన్నటి వరకు ఖాళీగానే ఉందే! అనుకుంటూ "ఏమే! నరిసీ! మేడమీదకు నీళ్లు తీసుకురా" అని పనిమనిషిని కేకవేసింది. అది నీళ్లుతెచ్చి వరండాలో పెట్టింది.

"ఏమే! ఎదురింట్లో ఎవరో దిగినట్టున్నారు! నా ఈడు ఆడపిల్లలెవరైనా ఉన్నారా? న్యూస్ ఏమాత్రం సేకరించావో అంతా చెప్పేయి!" అంది బ్రష్ నోట్లో పెట్టుకుంటూ సరోజ. నరిసికి పదిహేడు పద్దెనిమిదే ళ్లుంటాయి. టమాకారి. నలుపులోనైనా అందంగా కనబడుతుంది. పెద్ద బొట్టు పెట్టుకుని, ఏదో ఒక పువ్వు కొప్పులో తురుముకొని, కాలి మట్టెలు చిన్న శబ్దం చేస్తూంటే చకచక తెల్లవారక ముందే పనిలోకి వచ్చేస్తుంది. దాన్ని చూస్తే సరోజకు చాలా సరదా. పనిమనిషిలా కాకుండా ఒక సన్నిహితురాల్లా చూస్తు వుంది. దానికి తోడు నరసి కాస్త శుభ్రంగా కూడా ఉంటుంది.

"లేదమ్మగోరు! అక్కడ ఆడపిల్లలెలా గుంటారు? అందులో సదువుకునే బాబుగార్లు దిగారు. ఆంద్రా సిటీలో సదివినోరు, మరిగంటే ఒక డాక్టరు చదివే బాబు ఉన్నారు. ఆరంతా మీరు రేతిరి సినిమా కెళ్లనిచ్చి వచ్చి దిగారు."

"అబ్బో! చాల భోగట్టా లాగావే! అప్పుడే ఇదంతా ఎలా తెలుసుకున్నావే!"

"నిన్న మద్దేన్నెళ్ల ఒక తూరి ఆళ్లువచ్చి నన్ను ఇల్లదీ కడగమని పురమాయించి ఒక పనిమనిషిని కుదిర్చి పెట్టమన్నారు. అప్పుడే ఆ బాబులు సెప్పారు. ఇయ్యాల పొద్దుటే మా లచ్చిని తెచ్చిపెట్టినానమ్మా!"

ఇంతలో కిందనుండి సరోజ వాళ్ళ అమ్మ కేకవేశారు.

"అమ్మా! ఏలయినాది. అమ్మగారు కేకేస్తున్నారు. నేనెల్తాను" అంటూ తుర్రున మెట్లు దిగి వెళ్ళిపోయింది.

"బాగానే ఉందే, కథ!" అని అనుకుంటూ కాలేజీకి బయలుదేరే ప్రయత్నంలో పడింది. ఇంతలో ఏం జ్ఞాపకం వచ్చిందో కిటికీదగ్గరకువెళ్లి నిలబడి తల దువ్వుకోడం ప్రారంభించింది. ఇంతలో ఎదురింట్లోనుండి ఇద్దరు కుర్రవాళ్లు చేతులో పుస్తకాలతో సహా వెళ్ళిపోయారు. బహుశా యూనివర్సిటీ స్టూడెంట్సు అయి ఉంటారు. తర్వాత మరి ఇద్దరు కుర్రవాళ్లు కూడా వెళ్లారు. వాళ్లను ఎక్కడో చూచినట్లు తోచింది

కథానిక

సరోజకు. కాలేజీల్లోనే అయిఉంటుంది. ఇంక లెక్కప్రకారం మరొక అబ్బాయి రావాలి. అతణ్ణి కూడా చూసి అప్పుడు వెళ్దామని సరోజ అక్కడే నిలబడింది. కాస్సేపయిన తర్వాత అతడు రానేవచ్చాడు. రెండు నిముషాలు వాళ్ల వరండాలో నిలబడి మళ్ళీ లోనికి వెళ్ళాడు. ఈసారి స్టెతస్కోపు, చిన్న పుస్తకంతోసహా బయటకు వచ్చి, లాడ్జికి తాళంవేసి వెళ్లిపోయాడు. అతడు కనుచూపుమేర వెళ్లేవరకు ఆమె అలానే నిలబడిచూస్తూ ఉండిపోయింది. అతనిలో అందం ఒకపాలుంటే, ఆకర్షణ రెండుపాళ్లుంది. అతడు చదివే చదువు అందుకు ఒక కారణమై ఉండొచ్చు. ఏమయితేనేం సరోజకు ఆ భావి డాక్టర్‌మీద ఒకవిధమైన గౌరవం ఏర్పడింది.

♦ ♦ ♦

ప్రతిరోజూ ఆ అబ్బాయి కాలేజీకి వెళ్ళే వేళకు సరిగ్గా సరోజ కిటికీదగ్గర హాజరుగా నిలబడేది. అతడు కాలేజికి వెళ్లేటప్పుడు అతనిని తనివితీరా చూచిగాని అచటినుండి కదిలేది గాదు. ఇంతకుముందు సాయంత్రం డాబామీద చల్లగాలిలో కూర్చుని చదువుకునేది. కాని వీళ్లు వచ్చిన తర్వాత కిటికీదగ్గరకు మకాం మార్చి, వాళ్ళ లాడ్జివైపేచూస్తూ, ఆ అబ్బాయి కనుపిస్తాడనే ఆశతో కూర్చుని పుస్తకంలోని పేజీలు తిరగవేసేది. చాలరోజులవరకు ఆ అబ్బాయికి సరోజ విషయమై తెలియలేదు. కాని ఒక సాయంత్రం వాళ్ళ వరండాలో కుర్చీవేసుకు ఏదో పుస్తకం చదువుతూ కూర్చున్నాడు. కాస్సేపయిన తర్వాత ఏదో ఆలోచిస్తూ ఆకాశంలోకి చూడసాగాడు. నెమ్మదిగా అతని దృష్టి ఎదురింటిమీదకు, అచటినుండి వాళ్ల మేడ మీదకు పోయింది. అంతవరకు కిటికీవైపు చూడనేలేదు. దృష్టి ఆ చోటికి వచ్చేసరికి దానికి బ్రేక్‌పడ్డట్టయింది. అంతవరకూ లాడ్జివైపే చూస్తున్న సరోజ అప్పుడే తలవంచుకొని ఏదో చేస్తూంది. ఆ అబ్బాయి సరోజను చూచాడు. అప్పుడే వికసించిన పుష్పంలా వున్న ఆ జవ్వనిని చూడగానే మనస్సు గాడి తప్పినట్లయింది. ఇంతలో ఆమె తల ఎత్తింది. ఇద్దరూ క్షణం చూచుకున్నారు. అంతే! ఏదో సిగ్గు ఆవరించింది కాబోలు, సరోజ నెమ్మదిగా లేచి వెళ్ళిపోయింది. ఈ సంఘటన జరిగిన తర్వాత రోజూ వాళ్ళిద్దరూ చూపులతోనే మాట్లాడుకుంటూ చాల సన్నిహితులు కాసాగారు. ఇలా ప్రారంభమయింది వాళ్లప్రణయం.

ఆ రోజు పనెక్కువలేదు కాబోలు, నరిసి వాళ్ళ అమ్మగారితో బాతాఖానీ వేద్దామని మేడమీదకు వచ్చింది.

"ఏమిటే సంగతులు?" అంది సరోజ.

"ఏటున్నాయమ్మాగోరూ, ఏటైనా అడగండి సెబుతా."

"అడగనేమిటి! సరే! ఎదురింట్లో ఉన్న డాక్టరుబాబు గురించి ఏమైనా చెప్పు."

"ఆ, బాబుగారా! చాల మంచోరమ్మా ఆ కిరస్తానీ బాబు...."

"ఆ! ఏమిటే, క్రిస్టియనా!"

"అవునమ్మా! అదే ఆరి మతం. ఆ బాబు పేరు ఏదో సెప్పుతాదమ్మా, మా లచ్చి! పాడు మతి! మర్చిపోయానమ్మ! ఉండండి, గాపకం వస్తోంది—ఆ! చంజీవరావుగారు. అవునమ్మా, అదే! కాని, ఎందుకమ్మా ఆరి గురించి అడుగుతున్నారు" అంది నరిసి పెంకిగా.

"అబ్బే! ఏంలేదు, ఏంలేదే!" అంది కాస్త తడబడుతూ సరోజ.

ఆ మర్నాడు వంట్లో కాస్త నలతగా ఉంటే సరోజ కాలేజికి వెళ్ళలేదు. అలాగే పక్కమీద పడుకుని ఏదో పత్రిక తిరగేస్తూంది. ఇంతలో వాళ్ళ అమ్మ క్రిందనుండి—

"సరోజా! మీ ఫ్రెండ్ వచ్చిందమ్మా!" అంటూ కేకవేసింది.

"పైకి పంపించమ్మా" అంది సరోజ.

"ఏమోయ్! కాలేజికి రాలేదు, వంట్లో ఎలా ఉంది?" అంది ఆ వచ్చిన అమ్మాయి.

"ఆ, ఏంలేదు, పారూ! కాస్త నలతగా ఉంటేనూ! అది సరేగాని ఇవాళ కాలేజీలో విశేషాలేమిటి?" అంటూ ఏదో మాట్లాడుతూ కూర్చున్నారు.

ఇంతలో ఉన్నట్టుండి సరోజ టైంచూచింది- పావు తక్కువ ఆరు.

"ఏయ్! పారూ, ఇలారా నీకు ఒకటి చూపిస్తా" అంటూ సరోజ కిటికి దగ్గరకు తీసుకెళ్ళి నిలబెట్టింది. పార్వతి ఏమిటా అని చూసేసరికి ఎదురుగా వరండాలో కుర్చీలో ఒక మానవుడు వాళ్లవైపే చూస్తున్నాడు. గబుక్కున అక్కడనుండి తప్పుకుంది పార్వతి.

"ఏమిటే మొద్దూ! ఇక్కడకు తీసుకొచ్చి నిలబెట్టావేమిటి? నీకేంమతిపోయిందా?" అంది పార్వతి.

"చూచావా, సరిగ్గా! మరి బాగా చూడాలి సుమా!" అంది నవ్వుతూ సరోజ.

"ఇంతకీ ఏమిటి కథ! విప్పి చెప్పనే నెచ్చెలీ!"

"ఆ! మరేం గాభరాపడకు. ఆ అబ్బా ఎమ్. బి., ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. క్రిష్టియను. మా ఇద్దరికీ యీ మధ్యనే కాస్త కాస్త పరిచయం అవుతూ.....అవుతూ ఉంది. ఈ సంగతి నీకు తప్ప రెండో వాళ్లకి నేను చెప్పలేదు. తెలిసిందా!" అంది సరోజ.

ఇద్దరూ మళ్ళావచ్చి వాళ్ల స్థానాల్లో కూర్చున్నారు. పార్వతి ఏమీ మాట్లాడకుండా నిశ్శబ్దంగా కూర్చుంది.

"ఏమిటో ఆలోచిస్తున్నట్లున్నావ్!" అంది సరోజ.

"ఆ! నీ సంగతే! ఆయన చూస్తే క్రిష్టియను. నీవు చూస్తే పదహారణాల బ్రాహ్మణ స్త్రీవి. మీ యీ పరిచయం వృద్ధి అయితే ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందా....అని!"

"అదేంటోయ్! ఈ రోజుల్లో కూడా అలా మాట్లాడతావ్! వర్ణాంతర వివాహాలు జరగాలని అంతా ఘోష పెడుతూంటే....!"

"ఆ! ఆ ఘోష ఘోషలాగానే ఉంటుంది. కాని తీరా ఎవరైనా చేసుకుంటున్నారంటే, ఎవరైతే బల్లలు గుద్ది ఈ విషయం గూర్చి ఉపన్యాసాలు దంచుతారో, వాళ్ళే ఆటంకాలు పెడతారు. కులంలోనుండి వెలివేస్తామంటారు. ఒకటా! ఇలాగే ఎన్నో. తీరా అన్నింటిని ధైర్యంగా ఎదిరించి చేసుకున్నామనుకో, మన మూహించని సమస్యలు మనకు ఎదురవక తప్పవు. మన దేశం ఇంకా అభివృద్ధి చెందిన తర్వాతగాని ఈ మార్పులు ప్రజలు మామూలు దృష్టిలో చూడలేరు."

అబ్బ! ఎంత పెద్ద లెక్చర్ ఇచ్చావే! నీ ఉద్దేశం ఏమిటి?" అంది సరోజ.

"నా ఉద్దేశ్యం ఏమిటీ సరూ! స్నేహితురాలుగా నే చేయవలసిన సహాయాన్ని, ఇవ్వవలసిన సహకారాన్ని తప్పక ఇస్తాను. కాని కాస్త ఆలోచించి ఏ పనైనా చెయ్యి. ప్రొద్దు పోయింది. మరి వెళ్తానూ! నే నలా అన్నానని నువ్వు బాధపడకు. ఏదో నా ఉద్దేశాలు సందర్భానుసారంగా బయటపెట్టాను. వస్తానూ! గుడ్ నైట్!"

♦ ♦ ♦

సరోజ బి. ఏ., సంజీవరావు ఫైనలు ఇయర్ పూర్తి అయ్యేసరికి, వాళ్ళ ప్రణయంకూడా అన్ని స్టేజస్ పూర్తి చేసికొని పరిపక్వం పొందడానికి తయారుగా అయింది. ఇద్దరిలో ఎవరికి కూడా వాళ్ళ అభిప్రాయం పెద్దలముందు పెట్టడానికి తగినంత ధైర్యం లేదనే చెప్పాలి. అటువంటి విషయాలు ముచ్చటించడానికి సహజంగా బెరుగ్గానే ఉంటుంది. తల్లిదండ్రులు ఒక పట్టాన ఒప్పుకుంటారా! అందులోను సరోజ వాళ్ల అమ్మ చాల ఆచారపరాయణురాలు. కిరస్తానీ అల్లుడంటే ఏ నూతిలోనో పడతానని సత్యాగ్రహం చేసినా చేస్తుంది.

కాని సంజీవరావు సంగతి కాస్త మెరుగ్గానే తయారయింది. ఎలాగైనా మగవాడు! చదువు పూర్తిచేసుకున్నాడు. తల్లదండ్రుల నెదిరించైనా తన పంతం నెగ్గించుకొని తన సంగతి తాను చూసుకోగలడు. కాని వాళ్లవాళ్లు అంతటి కొడుకుని చేతులారా విడచిపెట్టలేకనూ, అంత కన్న చక్కని కోడల్ని తేగలమా అన్న ఆలోచనతోనూ, ఆ పెండ్లికి ఒప్పుకున్నారు.

వీళ్ల ప్రేమ సంగతి సరోజ వాళ్ల నాన్నకు, అమ్మకు తెల్సును. కాని తెలియనట్టే ఉన్నారు. ఎందుకంటే—'అవునా?' అని అడిగితే, అసలే గడుసుది 'అవును. చేసుకుంటాను' అని ఠక్కున చెప్పినా చెబుతుంది. దానికి జవాబు వీళ్లదగ్గిర సిద్ధంగాలేదు. వద్దంటే ఏ అఘాయిత్యమైనా చేస్తే, జీవితాంతం వరకూ కుము

లుతూ కూర్చోవలసిందే. కాబట్టి దాని కర్మకు దాన్ని వదిలేస్తే జీవితంలో ఏవైనా ఒడుదొడు కులువస్తే అదే అనుభవిస్తుంది—అన్న సిద్ధాం తానికి వచ్చారు. ఈ విషయంలో వాళ్ల అమ్మ కన్న వాళ్ల నాన్నే కాస్త లిబరల్‌గా ఉన్నారు.

"అదేమిటే! ఏదో వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు. కానిచ్చేస్తే సరి. ఈ కాలంలో ఇలాంటి వర్ణాం తర వివాహాలు చేస్తేనే గౌరవం! ఏం కథా! ఆ! ఏమంటావ్."—అన్నారాయన.

"నాముఖం! బాగానే ఉంది. అయినా నా మాట వినేవాళ్లు ఈ కొంపలో ఉంటేనా! వాడేమో కలకత్తాలో ఉన్నాడు. వాడొచ్చి ఏమైనా సరోజను దారికి తెస్తాడనుకుంటే, 'నా కిష్టమే కానిచ్చేయండి!' అని వ్రాస్తాడుగదా! నేనేం జేస్తాను?" అంది ఆవిడ.

"ఏదో వాళ్ల ఆనందమే మన ఆనందం."

"కాని ఒకటి అడుగుతాను చెప్పండి. ఆయన చూడబోతే క్రిస్టియన్. దీనికీ, ఆయనకీ భోజనం అదీ ఎలా సరిపడుతుందీ?"

"అదీ ఒక సమస్యేనా ఏమిటి! అవసర మొస్తే ఆయన వెజిటేరియన్ అవుతాడు. లేకుంటే మన అమ్మాయే వాళ్ల భోజనం అల వాటు చేసుకుంటుంది."

"రామ! రామ! ఏం మాటలండీ! మీకు మరీ వేళాకోళం!"

"ఏటే, అప్పా! అంత జోరుగా ఎల్తు న్నావు?" అంది నూకాలు, మెయిలు బండిలా పోతున్న నరిసితో.

"మరి బేగి ఇంటికెల్లి మళ్లా రావాలిగదంటే, అందుకని" అంది నరసి.

"సరేగాని, కబురు! మీ చిన్నమ్మాయిగోరు వెల్లాడేసిందటగా! ఏటి సంగతి?"

"ఆ! అదేంటో రిజిస్ట్రీ ఆపీసని ఒక అచ్చాపీసు వుంటదంటవే. మరి ఆ బాబు కిరస్తానీ బాబుగదూ! మా బాబుగారికి, అమ్మ గారికి ఒప్పందం అయినా, కులంవోల్లు ఒప్ప కోరుగా. అందుకని ఆ అఫీసులోనే పెల్లి అయి పోనాది. ఏవో సంతకాలెట్టినారంట. అంతే!"

"అదేటే! ఇచిత్రం! అక్కడ సివంచలం కొండమీద దేవుణ్ణాగ ఏ దేవుడన్నా ఉంటాడు గామోను!"

"అదేటో! పెళ్ళిమాత్రం. అయిపోనాది. రేపో, ఎల్లుండో ఆరిద్దరు బెజవాడ ఎల్లిపోతా రంట. అక్కడ ఆ బాబుగారికి ఉద్యోగం అయిందట. అందుకే పని జోరుగా ఉంది. మరెళ్ళొస్తానే, నూకాలూ!" అంటూ నరిసి వెళ్ళిపోయింది.

* * *

సరోజ, సంజీవరావులు బెజవాడలో క్రొత్త కాపురం పెట్టారు. క్రొత్త జంటలు ఎలా గడుపు తారో అంతకన్నా ఎక్కువ ఆనందమే అనుభ విస్తున్నామని అనుకున్నారు యిద్దరూ. నిజానికి అంతే కూడాను! రెండు సంవత్సరాలు రెండు నిముషాల్లా గడిపారు. తరువాత, ఒక చల్లని వేళ విశాఖపట్నంలో ఉన్న సరోజ వాళ్ళ అమ్మ నాన్నగార్లకు ఒక చక్కని వార్త వచ్చింది. అది ఆ ముసలి దంపతులను ఆనంద సముద్రంలో ఒక్కసారి ముంచి ఎత్తింది. త్వరలో తాము అమ్మమ్మ, తాతగార్లు కాబోతున్నారట! అమ్మాయిని పుట్టింటికి తీసి కొచ్చింది మాతృమూర్తి. తరువాత సకాలంలో మరొక చల్లనివేళ సరోజ చక్కని మగబిడ్డను కన్నది. అబ్బాయికి ఐదోనెల వచ్చింతర్వాత అన్ని హంగులతోను సరోజను భర్త ఇంటికి సాగనంపింది వాళ్ల అమ్మ.

కాలం త్వరితగతిని దినాలు, మాసాలు. సంవత్సరాలు దాటి తన దారిని తాను పోతున్నది. సరోజ సంసారం ప్రశాంతంగా, సాఫీగా సాగిపోతూంది. దానికి తోడు ఇంటికి వెలుగు అయిన ఆ చిన్న పాపడు ఆ దంప తులకు మరీ ఆనందాన్ని కూర్చసాగాడు. బాబి గాడికి రెండో ఏడు వచ్చింది. చిన్న చిన్న మాటలు మాట్లాడేస్తున్నాడు. ఆ వయస్సులో పిల్లలు మాట్లాడుతూంటే వినడానికి చాలా ముచ్చటగా ఉంటుంది. వాడికి కాస్త కోపం వస్తే, "అమ్మా! తత్తా!" అనేవాడు. అది వాళ్లమ్మకు అమృతప్రాయంగా ఉండేది.

"చూడండి! వీడు నన్ను తంతాడట!" అనేది భర్తతో నవ్వుతూ.

ఇలా వాళ్ల రోజులు ఆనందంగా దొర్ల సాగాయి.

"అబ్బాయి పెద్దవాడయ్యాడు, చిన్నచిన్న మాటలు వస్తున్నాయి" అని కొడుకు ఉత్తరం వ్రాశే సరికి నాయనమ్మకు మనవడిని చూద్దా మన్న ఉబలాటం హెచ్చింది. ఏడాదిపిల్లాడిగా చూచింది అంతే.

సరే! అనుకున్నట్టుగానే ఆవిడ బెజవాడలో దిగింది.

ఈ అత్తా, కోడళ్ళ బాంధవ్యం అందరి లాంటిది కాదు. సరోజ ఆవిడని ఎప్పడూ 'ఏమండీ!' అనే తప్ప అత్తా అని పిల్చేదికాదు. ఆవిడ దాని విషయం ఏమీ పట్టించుకోకుండా మసలేది. ఆ ఇద్దరూ ఎవరి పనివాళ్లు చేసుకు పోతూండేవారు. ఎక్కువ సన్నిహితంగా ఎన్నడూ కనబడలేదు.

ఆవిడ ప్రొద్దుట లేవగానే అలవాటు ప్రకారం బైబిల్ చదువుకొని, ప్రార్థనచేసికొనేది. ఆవిడ దగ్గర బాబిగాడు చాలా అలవాటైపోయాడు. ఎప్పడూ 'నాన్నమ్మా!' అంటూ కొంగుపట్టుకు తిరిగేవాడు. ఆవిడ ప్రార్థన చేసుకొనేటప్పడు వీడూ హాజర్‌గా ఉండేవాడు. ఆవిడ చేసే ప్రార్థనలు అవీ వింటూ ఉండేవాడు. అందులోని కొన్ని మాటలు కూడ పట్టు బడ్డాయి.

ఒకరోజు అంతా కూర్చొని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. ఇంతలో బాబిగాడు గబగబవచ్చి వాళ్ళమ్మచెయ్యి పట్టుకులాగుతూ "అమ్మా! చోత్తంచేయి! ఊఁ దా!" అంటూ ఒకటే గొడవ. అది సరోజకి అర్థం అవలేదు. "ఏమిట్రా నీ గొడవ" అంటూ భర్తవంక అత్తవంక చూచింది. ఆవిడ గ్రహించి ఉంటుంది.

"ఏంలేదమ్మాయ్! స్తోత్రం అని అంటు న్నాడు. ప్రార్థనకు మోకరించడానికి పిలుస్తు న్నట్లున్నాడు. ఏం, నాయనా! అదేనా!" అంది మనుమడితో. వాడేమో అంతా అర్థమయి నట్లు బుర్ర ఊపాడు. అంతా నవ్వుతూ వాడి సరదాకొరకు మోకరించారు సరోజతో సహా.

బాబిగాడికి వాళ్ల నాయనమ్మ అలవాట్లు అలవడ్డాయి. సాయంత్రం ఐందంటే బుద్ధిగా వాళ్ళ నాయనమ్మదగ్గర కూర్చుని ఆవిడ చేసే ప్రార్థన వినటం వాడికి ఒక సరదా ఐంది. ఆవిడకు మనుమడిని చూస్తే కొండంత ముచ్చట వేసేది. ఒక నెల్లాళ్లుండి ఆవిడ బాబిగాడిని విడవలేక విడిచి వెళ్ళిపోయింది.

ఈవిడ వెళ్ళినతర్వాత సరోజకు ఇంట్లో పని మరీ కష్టమనిపించింది. ఆవిడ ఉన్న ప్పడు పిల్లాడి గొడవ తనకేమీ ఉండేదికాదు. కాని యిప్పడు వీడి సంగతి, ఇంటి సంగతి చూచుకునేసరికి తాతలు దిగివస్తున్నారు. 'అమ్మను పిలిపించుకుంటే ఎలా ఉంటుంది!' అని ఆలోచించి, ఆ రాత్రి భర్త చెవిలోవేసింది ఆయన, 'దానికేం! నిక్షేపంలా రమ్మను. పెద్ద తోడు ఉండటం ఎంతైనా మంచిది' అన్నాడు. సరోజ వాళ్ళమ్మను రమ్మని వ్రాసింది.

♦ ♦ ♦

సరోజ వాళ్ళ అమ్మ ఆ రోజు మెయిల్‌లో దిగింది. అల్లుడు డ్యూటీలోకి వెళ్ళిపోయాడు. ఆవిడ ఇంతకుముం దెప్పడూ ఇక్కడికి రాలేదు. సరోజ పెండ్లి ఐనతర్వాతనే తల్లి దగ్గరకు రెండు మూడుసార్లు వెళ్ళింది. ఇక ఆవిడ వచ్చినతర్వాత ఒకటే ప్రశ్నలవర్షము కురిపించ సాగింది.

"సరోజా! వంట ఎవరు చేస్తున్నారు? వంటవాణ్ణి పెట్టుకున్నారా? లేదా? అల్లుడు మన వంటలు బాగా తింటాడా?"—ఇంకఇలాగే.

మర్నాడు ఆవిడ కూతురుతో ఇలా అంది:

"అమ్మాయ్! ఇవాళనుండి నేనే మడిగట్టు కుంటాను."

"సరేనమ్మా! నీ ఇష్టం!" అంది సరోజ.

"అమ్మాయ్! దేవతా విగ్రహం ఒక్కటీ లేదేమీ? రాములవారి ఫొటో ఐనా ఉందా?"

"లేదమ్మా" అంది సరోజ చిన్నగా ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

"అయితే పూజా పునస్కారము అలాంటి దేమీ లేదన్నమాట!"

"అదేమిటో అమ్మా! నే నేనాడైనా పూజలు ఇంట్లో చేశానా? ఇక్కడ అసలే లేదు."

"ఆ, బాగానే ఉంది. ఏదీ మీ పనిది?"—

"ఏమేవ్! అప్పలమ్మా! బజారుకు వెళ్లి ఒక మంచి రాములవారి ఫొటో, కర్పూరం అవీ తెచ్చిపెట్టు. త్వరగా రావాలి సుమా!" అని ఆవిడ దాన్ని బజారుకు తరిమింది.

ఈ సరంజామా అంతా వచ్చిం తర్వాత ఆవిడ చిన్న పూజామందిరం ఏర్పాటు చేసు కుంది. ఓరోజు సాయంత్రం తల్లీకూతుళ్లు ఏదో లోకాభి రామాయణం మాట్లాడుకుంటున్నారు. వాళ్ళకు కొంచెం దూరంలో బాబిగాడు ఆడు కుంటున్నాడు. ఏదో జ్ఞాపకం వచ్చినట్లుగా గబగబ వాళ్ళ అమ్మమ్మ దగ్గరకువచ్చి,

"మామ్మా! చోత్తంచేయి" అంటూ చేయి పట్టుకు లాగడం మొదలు పెట్టాడు.

"ఏమిటే అమ్మాయ్! మరోచొక్కా వెయ్య మంటాడేవిటి? ఏంరా! ఈ చొక్కా బాగు లేదూ!" అంటూంటే సరోజ విరగబడినవ్వటం మొదలుబెట్టింది.

"ఎందుకే అలా నవ్వుతావ్!" ఏమిటి వాడంటున్నది?" అన్నదావిడ.

"అదికాదే అమ్మా! స్తోత్రం చెయ్యమంటు న్నాడు" అని వాళ్ళ అత్తగారిదగ్గర వీడు నేర్చు కున్న విద్యగురించి చెప్పింది.

ఆవిడ అలా వింటూ కొయ్యబొమ్మలా కూర్చుండి పోయింది. బాబిగాడింకా అరుస్తూనే ఉన్నాడు. ఆవిడ అదేమి పట్టించుకొనక పోయేసరికి వాడూ ఊరుకోవలసి వచ్చింది.

మర్నాడు ప్రొద్దుటే ఆవిడ స్నానం అయిం తర్వాత పూజ చేసికొంటోంది. బాబిగాడు చూచాడు. వాడికిదంతా వింతగాఉంది. ఆవిడ మనవణ్ని చూచి—

"ఒరే! నాయనా! దా, దా!" అని పిలి చింది. వాడు వెళ్ళాడు.

"నాయనా! నమస్కారం పెట్టు. ఈబొమ్మ ఎవరో తెలుసా, రాములవారురా! దేవుడు. తెలిసిందా!"అని వాడితో నమస్కారంపెట్టించి, "చోత్తం అంటావే అదిచెడ్డ. ఇదేమంచి. తెలి సిందా! ఆ! మా నాయన బంగారు తండ్రి గదూ! అమ్మమ్మ చెప్పినట్టల్లా వింటాడు"అని ఆ చిన్నబుర్రలోకి ఈవిడగారి భయం అంతా ఎక్కించడం ప్రారంభించింది.

* * *

రాత్రి తొమ్మిదిన్నర అయింది. బాబిగాడు నిద్రపోయిం తర్వాత నెమ్మదిగా భర్తపక్కను చేరింది సరోజ. ఆతడు టేబిల్ లైట్ క్రింద ఏదో చదువుకుంటున్నాడు.

భార్యవంక తిరిగి సంజీవిరా విలాఅన్నాడు.

"సరోజా! మీ అమ్మ బాబిగాడికి ఏదో మంత్రోపదేశం చేస్తున్నట్లుంది."

"ఏం! మీ రెవ్వడు చూచారూ?" అంది సరోజ, "ఇవాళ ప్రొద్దుటేలే!"అన్నా డాయన.

"అయితే, అదేం తప్పా? మీ అమ్మ మీ మతం చెబితే, మా అమ్మ మా మతం చెబు దూంది."

"ఇదేనా నీ ఆర్గ్యుమెంటు! బాబిగాడిచిన్న బుర్రలో ఇన్ని ఉద్దేశాలు ఇరికించటమా! వాడు చివరకు నాస్తికుడుగా తప్పక తయారవు తాడు. ఇప్పుడైనా అలా చెప్పొద్దని మీఅమ్మకు చెప్పు."

ఈ మాటలు వినేసరికి సరోజకు రోషం వచ్చింది.

"అదేమిటండీ! మీఅమ్మ చెప్పింది రైటా! మాఅమ్మ చెప్పింది తప్పా? వాడు మీకెంతో నాకంతేగా, నా నమ్మకాలని కొంత పంచుకో నివ్వండి!"

"ఏమిటలా తెలివి తక్కువగా మాట్లాడు తావ్!వాడేంముప్పైఏళ్లయువకుడనుకున్నావా! ఇంకా మూడేళ్ళయినా నిండలేదన్న సంగతి జ్ఞాపకముంచుకో. బి. ఏ; చదివావు. మరీ ఆమాత్రం చైల్డ్ సైకాలజీ అర్థం చేసుకో లేవా? నే చెప్పవలసింది చెప్పాను. తర్వాత చింతిస్తావ్!"అని మళ్లా చదువులో మునిగాడు.

సరోజ మరోవైపు తిరిగి పడుకుంది. "ఈయన ఎప్పుడూలేంది ఇవాళ ఇలా మాట్లాడే డేమిటి? తనను తన తల్లిని అవమానిస్తు న్నాడా?"—ఇలాంటి ఆలోచన వచ్చేసరికి కళ్లంట నీళ్లు కారటం అరంభించాయి, అలాగే ఏవో ఆలోచనలు బుర్రలోకి వస్తూవుండగానే నిద్రపట్టేశింది.

మర్నాడు ఆయన హాస్పిటల్‌కు వెళ్లేవరకూ ఆయనతో ఒక్కమాట మాట్లాడలేదు సరోజ. సంజీవరావు కూడా ఉదాసీనంగానే ఉంటూ వచ్చాడు. ఇలా నాలుగురోజులు ఎడముఖం పెడముఖంగానే ఉన్నారు.

సరోజ వాళ్ల నాన్న, వాళ్ల అమ్మను అర్జంటుగా రమ్మని ఉత్తరం వ్రాసాడు. ఆవిడ ఆ ప్రకారంగా బండెక్కి చక్కా వెళ్లిపోయింది.

బాబిగాడు ఈమధ్య సాయంత్రంవేళ ఒకటే ఏడుపు. ఇంతకు ముందు చక్కగా ఆడుకునేవాడు. లేకపోతే వాళ్ల నాన్నమ్మ నేర్పిన పాటలు, ప్రార్థన తానే అనుకుంటూ, ఏమేమో మాట్లాడుకుంటూ ముచ్చటగా ఆడుకునేవాడు. కాని ఇప్పుడు వాళ్ల అమ్మమ్మ అవన్నీ చెడ్డ అని చెప్పగానే, వాడికి బహుశా ఏం చేయడానికీ తోచడం లేదేమో....ఒకటే ఏడుపు. తనకేమో మనశ్శాంతిలేదు. దానికి తోడు వీడి గోల. సరోజ ఆ సాయంత్రం బాబిగాణ్ణి సముదాయిస్తూ ఆలోచనలో పడింది.

"ఎందరో ఏమేమోఅన్నారు క్రిస్టియన్‌ని చేసుకుంటున్నందుకు. కానిఅలాచేసుకున్నందుకునేనెప్పుడు కించిత్తయినా విచారించలేదు. మొన్నటివరకు నా సంసారం ఎంతో చక్కగా సాగింది. మా ఇద్దరిలో ఎవరికి కులాలు, ఆచారాలు జ్ఞాపకమే లేవు. కాని యీ ముసలాళ్ళిద్దరూ వచ్చి యీ చిన్నాడికి వాళ్లవాళ్ల అభిప్రాయాలు నూరిపోయటంతో వచ్చింది చిక్కు. అవును మరి! ఆవిడ నేర్పాలని నేర్పలేదు పాపం! ఆవిడ చేస్తూంటే చూచి వీడే నేర్చుకున్నాడు. పోనీ, అమ్మ అన్నా ఊర్కొంటే పోనుగా! అది చెడ్డ, ఇదే మంచి అని ఎందుకు చెప్పడం! మాకు యీ మనస్పర్థలేమిటి? నిజంగా, ఆయన మంచివారు కాబట్టి సరిపోయింది. కాని ఆయన పట్టుబడితే ఆయన పంతమే నెగ్గుతుందిగా. అయినా నేనే తొందర పడ్డట్టున్నాను. అబ్బ! ఆయన మాట్లాడకపోతే, ఈ ఇల్లు ఒక అడవిలా ఉంది. ఏమయినా సరే ఇవాళ క్షమించమని అడిగేస్తాను. దీనికంతటికీ నా అహంకారమే కారణం!" అంటూ ఏమేమో ఆలోచిస్తూ కూర్చుంది.

ఆ రాత్రి సరోజ నెమ్మదిగా భర్త గదిలోకి ఒక క్రొత్త పెండ్లికూతురులా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళింది. సంజీవరావు చూసీ చూడనట్లుగా ఊరుకున్నాడు.

"ఏమండీ!"

"..........."

"మాట్లాడరా?"

"ఏం మాట్లాడను?" అంటూ నవ్వుతూ ఆమె వైపు తిరిగాడు.

అప్పటికే సరోజ కళ్ళలో సుళ్ళు తిరుగుతున్న నీళ్లు, కాస్త జలజల రాలాయి.

"అదేమిటి?? యూ! సిల్లీ!! ఊర్కో, పిచ్చిదానా!" అంటూ సరోజను దగ్గరకు తీసికొన్నాడు.

"నన్ను క్షమించరూ! అంటూ ఆమె భర్త మీద వాలింది.

"ఇలాచూడు! నేనేదో అన్నానని నీకు కోపం వచ్చిందా! నేను మన బాబిగాడి మంచి కోరే చెప్పాను. చూచావా? వాడు సాయంత్రం ఎలా పేచీ పెడుతున్నాడో! ఇకమీదట మీ అమ్మ వచ్చినా, మాఅమ్మ వచ్చినా వాళ్ళ పూజలు, ప్రార్థనలు వీడిముందు చేయకుండా మాత్రం చూడాలి. చిన్నప్పటినుండీ వీడికిగొడవదేనికి? పెద్దవాడైతే వాడిబుద్ధికి ఎలాతోస్తే అలాగే వాడు అనుసరిస్తాడు. సాయంత్రం వాడిని నాకు తీరిక ఉన్నప్పుడల్లా అలా పార్కుకి, కృష్ణాఒడ్డుకి తీసికెళ్ళు తుంటాను. అలా లేనప్పుడు నీవు నర్సరీరైమ్‌సు, చిన్నచిన్న కథలు చెప్తూండు. వాడిదృష్టి ఇలా మళ్ళిస్తే, గౌతమ బుద్ధుడి లక్షణాలు కాస్త తగ్గుతాయి, అవిగో! ఇవాళే తెచ్చాను. వాడికోసం బొమ్మల పుస్తకాలు!"అని సంజీవరావు తన అభిప్రాయాన్ని, సలహాని సరోజముందు పెట్టాడు.

సరోజకు మబ్బులన్నీ విడి చంద్రుడు తేలికగా కనబడుతున్నట్లయింది. అతని కళ్లల్లోకి క్షణంచూచి—

"ఎంత మంచివారండీ, మీరు!" అని అతని హృదయంలో తలదాచుకు ప్రశాంతంగా చాలా రాత్రుల తర్వాత, తీయని కలలుకంటూ నిద్రపోయింది సరోజ. ★